ఓటు వినియోగం.. పౌరుల బాధ్యత


ఓటుపై అవగాహన కల్పిస్తున్న మెప్మా సిబ్బంది, అధికారులు


ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ అయిలయ్య, ప్రొఫెసర్లు


కాశిబుగ్గలో..


నయీంనగర్: అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వరంగల్ అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు వినియోగాన్ని ప్రతీ పౌరుడు బాధ్యతగా భావించాలని వరంగల్ జిల్లా పరిశ్రమల అధికారి నర్సింహమూర్తి అన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ముఖ్యంగా మురికివాడల్లో ఓటర్ల నమోదు శాతం పెంచడమే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగడ్డ, ముదిరాజ్‌వాడ స్లమ్ ఏరియా, వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని అరెపల్లి బీసీ కాలనీ స్లమ్ ఏరియాల్లో పర్యటించి ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానంపై ముద్రించిన ప్రతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యతపై జరిగిన ర్యాలీలో స్వయం సహాయక మహిళ బందాల సభ్యులతో పాటు స్థానిక మహిళలు, ప్రజలను భాగస్వాములను చేస్తూ ఓటు ప్రాధాన్యతను వివరించినట్లు తెలిపారు. ఓటరు ప్రచార చైతన్య రథంలోని ఈవీఎంల (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) ద్వారా ఓటు వేసే విధానంతో పాటు వేసిన ఓటు నిర్ధారణ వంటి అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం రమేష్, నియోజకవర్గ స్వీప్ నోడల్ అధికారి కోలా రాజేష్ కుమార్‌గౌడ్, టీఎంసీ రమేష్, సీఓలు రాజ్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఓటు హక్కు ఓ వజ్రాయుధం

కాశిబుగ్గ: ఓటు హక్కు ఓ వజ్రాయుధంలాంటిదని, ఓటర్లందరూ బాధ్యతగా దాన్ని వినియోగించుకోవాలని వరంగల్ జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్ఓ) సత్యవాణి సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు దేశాయిపేట సీకేఎం కళాశాల మైదానంలో నిర్వహించిన స్వీప్ కప్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎల్‌బీ కళాశాల జట్టు.. డీఎస్‌ఏ వరంగల్ జట్టుపై విజయం సాధించింది. ఈ సందర్భంగా డీవైఎస్ఓ సత్యవాణి మాట్లాడుతూ రెండు రోజులుగా నిర్వహించి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి 19న హనుమకొండ జేఎన్ఎస్‌లో హనుమకొండ జిల్లా జట్టుతో జరగనున్న పోటీలో వరంగల్ జట్టు తరఫున ఆడించనున్నట్లు వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

కేయూ క్యాంపస్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఓ ఆయుధం లాంటిదని, అర్హులందరు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య సూచించారు. కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు ఓటుహక్కుపై ప్రజలను విద్యార్థులు చైతన్యం చేయాలని కోరారు. గ్రామాల్లో పర్యటించి ఓటు విలువను తెలియజేయాలని కోరారు. ఎక్కువ మంది ఓటును వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ చందులాల్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

నయీంనగర్: ఎన్నికల్లో 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ హనుమకొండ కేయూసీ రోడ్డులోని ఏకశిల హైస్కూల్ విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కలిగించారు. ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు హామీ పత్రాలు ఇచ్చి వాటిపై కుటుంబ సభ్యుల సంతకాలు సేకరించి మండల కార్యాలయంలో అందజేశారు. ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, ఓటు హక్కు ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీకాంత్, రవి, గుర్మిత్‌కౌర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌లో దిగబడిన కారు

- తప్పిన ప్రమాదం
- నెల రోజుల్లో నాలుగో ఘటన


తెలంగాణ కళాశాల ఎదుట మ్యాన్‌హోల్‌లో పడిన కారు ముందు టైరు

హన్మకొండ: మ్యాన్‌హోల్‌పై కప్పు బిగించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. హనుమకొండలోని 8వ డివిజన్ పరిధిలోని టైలర్ స్ట్రీట్‌లోని తెలంగాణ కళాశాల ఎదురుగా రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్ తెరుచుకుని ఉండడంతో యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో కారు ముందు టైరు అందులో పడింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు, కానీ కారు ముందు భాగం దెబ్బతిన్నదని వాహనదారుడు తెలిపారు. ఈ నెలలో రెండు కార్లు, రెండు బైక్‌లు మ్యాన్‌హోల్‌లో పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈవిషయంపై స్థానిక కార్పొరేటర్ బైరి లక్ష్మీకుమారిని వివరణ కోరగా 8వ డివిజన్‌లో ప్రధానదారి వెంట ఐదు మ్యాన్‌హోళ్లకు గ్రిల్స్ లేవని అన్నారు. తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు మూడు నెలల్లో 30సార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలకు క్రీడాసామగ్రి వితరణ



వరంగల్: ఖిలా వరంగల్ మండలం శంభునిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని పిల్లలు ఆడుకునేందుకు సుమారు రూ.లక్ష విలువైన క్రీడాసామగ్రిని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయురాలు మాధవి సహకారంతో రామడుగు మంజులదేవి – సోమేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు అందజేసినట్లు ఎంఈఓ విజయకుమార్ తెలిపారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఉయ్యాలలు, జారుడు బల్ల, రెయిన్‌బోలను ఎంఈఓ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్ అస్మాసుల్తానా, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శారదబాయి, హెచ్ఎం సోల శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, సునీల్‌కుమార్, రాజు, పవిత్ర, మమత, సరిత, షాహిదాబేగం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్ చైర్ బహూకరణ



కాజీపేట రూరల్: సర్వప్రేమ సొసైటీ ఫౌండర్ రెవరెండ్ ఫాదర్ అంతోనియో గృగ్ని వర్ధంతి సందర్భంగా కాజీపేట ఫాతిమానగర్ సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో దివ్యాంగుడికి వీల్ చైర్‌ను శనివారం పంపిణీ చేశారు. వీల్‌చైర్‌ను ఫాదర్ జెరోమ్ చేతుల మీదుగా దాతలు కల్యాణ్‌రెడ్డి, అనుపమ రెడ్డి దంపతులు బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో రాజు, ఆంథోని, సర్వప్రేమ సొసైటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రవికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో పరిశోధకుడు ధర్మారపు రవికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. హెచ్ఆర్ ప్రాక్టీసెస్ ఇన్ ఎస్‌సీసీఎల్ – ఏ స్టడీ ఆఫ్ సెలక్టెడ్ డిస్ట్రిక్ట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. కళాశాల ప్రొఫెసర్ అమరవేణి పర్యవేక్షణలో రవి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో రవి కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

నేడు కార్తీక వన భోజనాలు

వరంగల్: ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించనున్న పద్మశాలి కార్తీక మాస వనభోజన కార్యక్రమానికి కులస్తులు తరలిరావాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రవీందర్ పిలుపునిచ్చారు. జిల్లా, పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించున్న మహోత్సవంలో జిల్లాలోని పద్మశాలి కుల బాంధవులు సకుటుంబ సమేతంగా పాల్గొని పూజలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు.

22న పద్మశాలీల సమ్మేళనం

హన్మకొండ: ఈనెల 22వ తేదీన హనుమకొండ హంటర్‌రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్‌లో పద్మశాలీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు తెలిపారు. హనుమకొండ రెడ్డికాలనీలోని సంఘం భవనంలో కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం ప్రారంభమయ్యే సమ్మేళనానికి పద్మశాలి సంఘం ప్రాథమిక సభ్యులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గుర్రపు రమేష్, కోశాధికారి నరెట్ల మహేందర్, బేతి రమేష్, దంపేటి నరేందర్ బాబు, గోరంట్ల రాజ్‌కుమార్, గంజి రాజేందర్, బత్తుల మహేందర్, కూచన సురేష్, కూరపాటి శ్రీనివాస్, చెన్నూరి రాజు, దుంపేటి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

23న మున్నూరుకాపు ఆత్మీయ సభ

హన్మకొండ: మున్నూరుకాపుల ఆత్మీయ ఆశీర్వాద, కృతజ్ఞత సభను ఈనెల 23న హనుమకొండలో నిర్వహించనున్నట్లు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం జరగనున్న సభను కులస్తులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ కార్పొరేటర్

వరంగల్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 14వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన, ఆమె భర్త మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య శనివారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రేవంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పిల్లల చదువుపై దృష్టి పెట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాధ


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హెచ్ఎం మల్లారెడ్డి

మడికొండ: తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై దృష్టి సారించాలని సమగ్ర శిక్ష అభియాన్ కమ్యూనిటీ మొబిలైజేషన్ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ రాధ సూచించారు. రాంపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆమె హాజరై ఈనెల 14నుంచి 21వ తేదీ వరకు జరగనున్న పిల్లల బాధ్యతా వారాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం వేణుఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్ రేణుక, ఉపాధ్యాయులు సోమయ్య, రవీందర్, స్వప్నరాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మడికొండలో పాఠశాలలో..

మడికొండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతుల కల్పన, విద్యార్థుల ప్రగతి, విద్యార్థుల హాజరుశాతం వంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం స్కూల్ కేబినెట్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. టెస్టుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, దండ కోమల్‌రెడ్డి, చంద్రయ్య, రాజేశ్వరి, అరుణ, రమేష్, హైమావతి, కమల, సరిత, సిబ్బంది చందు, కిషన్, విద్యాకమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ది ఎన్‌కౌంటర్ల ప్రభుత్వం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

హన్మకొండ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే ఎన్‌కౌంటర్లు ఉండవని చెప్పిన కేసీఆర్.. బూటకపు ఎన్‌కౌంటర్లతో విప్లవ సంస్థల నాయకులు, కార్యకర్తలను చంపించారని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు ఆరోపించారు. హనుమకొండలోని కాళోజీ విగ్రహం వద్ద పార్టీ రాష్ట్ర కమిటీ ప్రచురించిన కరపత్రాలను నాయకులు, కార్యకర్తలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల అడుగు జాడల్లోనే కేసీఆర్ ప్రభుత్వం నడిచిందని, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య హక్కులను హరించి వేసిందని వాపోయారు. న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు లింగన్నతోపాటు ఇతర విప్లవ సంస్థల నాయకులు, కార్యకర్తలను ఎన్‌కౌంటర్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం హత్య చేసిందని వాపోయారు. ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి రాజేందర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి రంజిత్, నాయకులు ప్రభాకర్, సాంబయ్య, కరుణాకర్, హరిబాబు, కృష్ణ, అక్బర్ ఖాన్, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టాన్ని ఎత్తివేసే కుట్ర


మాట్లాడుతున్న రాజేందర్

హసన్‌పర్తి: కోట్లాది మంది కూలీల ఆకలి తీరుస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ కుట్రలు పన్నుతోందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ ఆరోపించారు. హసన్‌పర్తి మండలం సీతంపేటలో ఉపాధి హామీ కూలీల సమావేశం శనివారం జరిగింది. వచ్చే నెల 4న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు సమావేశంలో రాజేందర్ మాట్లాడుతూ బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులను కేంద్రం గణనీయంగా తగ్గించిందని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో కూలీలకు పని దొరకడం లేదని వాపోయారు. పనిచేసిన 15రోజుల్లోనే వేతనాలు ఇవ్వాలని స్పష్టంగా పేర్కొనప్పటికీ చట్టాన్ని ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని చెప్పారు. రోజుకు రెండుసార్లు ఆన్‌లైన్ హాజరు అమలును వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఐదు లక్షల జాబ్‌కార్డులు ఉన్నప్పటికీ వారిలో కొంతమందికి సమాచారం ఇవ్వకుండానే పేర్లను జాబితా నుంచి కేంద్రం తొలగించిందని ఆరోపించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, నాయకులు బొౌతు రాధ, భాగ్య, రమేష్, లత, ఏఓ లత, కనకమ్మ, రాజు, మల్లయ్య, చంద్రయ్య, శేఖర్, శశికళ, రాణి, శ్రీనివాస్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

భారత్ ప్రపంచకప్ గెలవాలని పూజలు

మడికొండ: ఇండియా – ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరగనున్న క్రికెట్ ప్రపంచకప్ వన్‌డే మ్యాచ్‌లో భారత్ విజయం సాధించాలని కోరుతూ మడికొండలోని బురుజు వద్ద ఉన్న లక్ష్మీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు, క్రికెట్ అభిమానులు పూజలు చేశారు. కార్తీక మాసం మొదటి వారం కావడంతో అర్చకుడు మంత్రవాది వెంకటప్రసాద్ స్వామివారికి పంచామృతాలు, పంచవర్ణాలతో శనివారం అభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలతో అలంకరించారు. కార్యక్రమంలో పల్లపు మధు, బుర్ర రాజన్‌బాబు, శివ, తిరుపతి, శంకర్ సంజయ్, రమేష్, సురేష్, శోభన్, ముంజ రమేష్, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాలలో..

విద్యారణ్యపురి: ప్రపంచ వన్‌డే క్రికెట్ కప్‌లో భాగంగా భారత్ – ఆస్ట్రేలియా మధ్య ఫైనల్ మ్యాచ్ ఈనెల 19న అహ్మదాబాద్‌లో జరగనుంది. ఆ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు శనివారం భారత క్రికెటర్ల ఫొటోలతో కూడిన మాస్క్‌లు ధరించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రపంచ కప్ నమూనాను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పాక వెంకటేశ్వర్లు చూపెడుతూ భారత్‌ను విజయం తప్పక వరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్, వర్మ, రవళి తదితరులు పాల్గొన్నారు.

అందరివాడిని.. ఆశీర్వదించండి


ఐనవోలు: మాట్లాడుతున్న అరూరి రమేష్


హసన్‌పర్తి: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్

- బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి రమేష్

ఐనవోలు: ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునే అందరివాడినని.. ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే సేవ చేస్తానని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. రక్తచరిత్ర కలిగిన ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ కేఆర్.నాగరాజు కావాలో.. తను కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు. మండలంలోని నర్సింహుల గూడెం, ముల్కలగూడెం, కొండపర్తి, వనమాల కనపర్తి, రాంనగర్, లింగమోరిగూడెం, ఉడుతగూడెం, నాగపురం, ఒంటి మామిడిపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్‌లో చేశారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పర్వతగిరి: బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అరూరి రమేష్ అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు, కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్.నాగరాజు వ్యక్తిగత అనుచరుడు కొమ్ము రమేష్.. రమేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

మడికొండ: బీజేపీ వరంగల్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు వల్లెపు రేణుక, తదితరులు బీఆర్ఎస్ 46వ డివిజన్ పట్టణ శాఖ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈమేరకు వారికి కండువాలు కప్పి పార్టీలోకి రమేష్ ఆహ్వానించారు.

అతనొక ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు.. నేనొక సేవకుడిని..

హసన్‌పర్తి: 'అతనొక ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్.. విప్లవకారులను చంపాడు, నేను మాత్రం మీ మధ్యలోనే 12 ఏళ్లుగా ఉంటూ ప్రజా సేవ చేస్తున్నాను' అని బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. దేవన్నపేటకు చెందిన మాజీ దళ కమాండర్లు శ్రీపతి జంపయ్య, పోలెపల్లి భీమయ్యతో పాటు పలు పార్టీకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి రమేష్ ఆహ్వానించారు.

వర్ధన్నపేట : ఎమ్మెల్యే అరూరి రమేష్ మూడోసారి గెలుపుకోసం బీఆర్ఎస్ నాయకులు శనివారం వాడవాడలా, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో మునిసిపల్ చైర్ పర్సన్ ఆంగోతు అరుణ, కౌన్సిలర్ తోటకూరి రాజమణి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం ప్రతిపక్ష పార్టీలు తమ మనుగడ కోసం ఉన్నవీ లేనివి కల్పించి కల్లబొల్లి మాటలు మాట్లాడుతూ ప్రజలను అయోమయానికి గురి చేయడానికి చూస్తున్నారని తెలిపారు. ప్రజలు వారి మాటలు నమ్మొద్దని సూచించారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

మామునూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువతి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. ఎస్సై కృష్ణవేణి కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం తారాసింగ్ తండాకు చెందిన గుగులోతు సోనియా (19) వరంగల్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు చేస్తోంది. అశోక్ అనే వ్యక్తి బైక్‌పై తన సొంత గ్రామానికి ఆమె శుక్రవారం రాత్రి వరంగల్ నుంచి బయల్దేరింది. వరంగల్ – ఖమ్మం రహదారిపై మామునూరు శివారు చెరువు కట్ట వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చే ఆటోను తప్పించబోతూ బైక్‌పై నుంచి సోనియా, అశోక్ కిందపడిపోయారు. రోడ్డుపై వారిని ఓ కారు ఢీకొట్టడంతో ఇద్దరు గాయాలయ్యాయి. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన సోనియా చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

మద్యం మత్తులో హత్యాయత్నం

రామన్నపేట: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై కత్తితో పక్కా ప్రణాళికతో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి వరంగల్ నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే వరంగల్ శివనగర్‌కు చెందిన పులివేరు చందు, బండారు తేజ స్నేహితులతో కలిసి వరంగల్ చౌరస్తా సమీపంలోని మద్యం తాగారు. ఆ సమయంలో ఇరువురి వాగ్వాదం జరగడంతో బారు వెనుక గల్లీలో తేజపై చందు కత్తితో దాడి చేసి గొంతు, మెడపై తీవ్రంగా గాయపరిచాడు. దాంతో తేజ అక్కడి నుంచి పరుగున వెళ్లి రోడ్డుపై పడిపోయాడు. అది గమనించిన స్థానికులు ఇంతేజార్‌గంజ్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి హుటాహుటిన చేరుకుని ఎంజీఎం ఆస్పత్రి తరలించారు.

సంక్షిప్తంగా

కాజీపేట రైల్వే సీసీఎస్ డైరెక్టర్‌గా శ్రీనివాస్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) డైరెక్టర్‌గా డాక్టర్ డి.శ్రీనివాస్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన రైల్వే సీసీఎస్ ఎన్నికల్లో డెలిగేట్‌గా గెలిచి, డైరెక్టర్ పదవికి నామినేషన్ వేయగా.. పోటీలో ఎవరూ లేకపోవడంతో యునానిమస్‌గా ఎన్నికైనట్లు శనివారం సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారులు ప్రకటించినట్లు శ్రీనివాస్ తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఏజే.మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌ను శనివారం రాత్రి సీపీ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పెండింగ్ కేసుల వివరాలు, స్టేషన్ పరిసరాల్ని పరిశీలించారు. అనంతరం సన్నిహితలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ కె.సంధ్యను కలిసి కేసుల నమోదు వివరాలు, రికార్డుల్ని పరిశీలించారు.

రోడ్డుపై బోరు వేయొద్దని ఆందోళన

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో రోడ్డుపై బీఆర్ఎస్ కార్యకర్త బోరు వేయడాన్ని నిరసిస్తూ శనివారం రాత్రి స్థానికులు ఆందోళనకు చేశారు. ఆ సమయంలో అటువైపుగా వెళ్తున్న కాంగ్రెస్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ.. స్థానికులకు సంఘీభావం తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బోరు పనులను నిలిపివేయించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఖిలా వరంగల్: క్రీడలతోనే విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఏకశిల డీజీ స్కూల్ ప్రిన్సిపాల్ బేతి కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం భారత్ – ఆస్ట్రేలియ వన్‌డే ఫైనల్ మ్యాచ్ సందర్భంగా భారత్ క్రికెట్ క్రీడా జట్టుకు అభినందనలు తెలుపుతూ వరంగల్ శివనగర్‌లోని ఏకశిల డీజీ హైస్కూల్ ప్రాంగణంలో వైస్ ప్రిన్సిపాల్ లవకుమార్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ సంబరాలు నిర్వహించారు.

పిల్లల ఇష్టాలను గుర్తించాలి

ఖిలా వరంగల్: చిన్నతనంలోనే పిల్లల ఇష్టాలను గుర్తించి ఇష్టమైన రంగంలో వారు రాణించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని చాణక్య విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ అచ్చ వినోద్‌కుమార్ సూచించారు. ప్రకృతిలో లభించే పలు రకాల పండ్ల విశిష్టతను పిల్లలకు తెలిపేందుకు ఫ్రూట్స్‌డేను ఉపాధ్యాయులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం, పలు రకాల పండ్లను నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు పంపిణీ చేశారు.

ముగిసిన అభిజ్ఞాన్ వేడుకలు

హసన్‌పర్తి: అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన అభిజ్ఞాన్ -2.0 వేడుకలు శనివారం ఘనంగా గిశాయి. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ నేర్చుకున్న మెళకువలు భవిష్యత్‌లో ఉద్యోగం సాధించడానికి తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో ఐఈఈఈ బ్రాంచ్ అడ్వైజర్ మూల రాము, అధ్యాపకులు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, డాక్టర్ ఎస్. శ్రీవాణి, ఏఓ వేణుగోపాల్, విద్యార్థి కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో అన్నపూజ

కాజీపేట: కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయంలో స్వామివారికి శనివారం అన్నపూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పండితులు అభిషేకాలు, అర్చనలు జరిపించి, అనంతరం అన్నపూజ చేశారు.

సిద్ధాంతి జన్మదిన వేడుకలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి.. భక్తులు, కుటుంబ సభ్యులతో కలిసి తన జన్మదిన వేడుకలను శనివారం జరుపుకున్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయుల వేషధారణలో హాజరై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులుగా పనిచేసిన తమ అనుభవాలను విద్యార్థులు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుమలేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్ రెడ్డి, కల్పనారెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.